జీవో 97ను తక్షణమే రద్దు చేయాలి



5లో..

www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

భద్రాద్రి కొత్తగూడెంకు చారిత్రాత్మక విజయం




3వ పేజీల్లో

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 202, ఆదివారం 23-8-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వెల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam


# మెట్రో రెండో దశలో సరికొత్త హంగులు

ఓచోట 'డబుల్ డెక్', మరోచోట భూగర్భ మార్గం

మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశలో పలు ప్రత్యేకతలు, సవాళ్లు

హకీంపేట విమానాశ్రయం సమీపంలో భూగర్భ మెట్రో మార్గం

మదీనాగూడ, చందానగర్ మధ్య 1.2 కి.మీ పొడవైన డబుల్ డెక్

మెట్రో రెండో దశలో హకీంపేట విమానాశ్రయం సమీపంలో భూగర్భ మార్గం

**హైదరాబాద్, ఆగస్టు 22 :**

మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశ ప్రత్యేకతలు, సవాళ్లతో కూడుకున్నది. ఈ మార్గం సంక్లిష్టమైన రైల్వే క్రాసింగ్‌లు, ఫ్లైఓవర్లు, హైటెన్షన్ విద్యుత్ లైన్లు, విమానాశ్రయ ప్రాంగణాల గుండా వెళ్లాల్సి ఉంటుంది. జేబీఎస్ నుంచి శామీర్‌పేట కారిడార్‌లో హకీంపేట విమానాశ్రయం రన్‌వే కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు హెచ్‌ఎండీఏ ప్రణాళిక చేసిన హైవే టన్నెల్ వెంబడి 1.65 కి.మీ మేర భూగర్భ మెట్రో మార్గాన్ని ప్రతిపాదించారు. అదేవిధంగా నాగోల్ టూ శంషాబాద్ మార్గంలో విమానాశ్రయం సమీపంలో 1.6 కి.మీ భూగర్భ మెట్రో విభాగాన్ని ..మిగతా 2లో



## గచ్చిబౌలిలో కుప్పకూలిన

# ఏడంతస్తుల భవనం

## ఇద్దరు మృతి..మరొకరికి తీవ్ర గాయాలు

**హైదరాబాద్, ఆగస్టు 22:**

గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో ఏడంతస్తుల భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా.. రమణారెడ్డి అనే మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. అయితే, నాలాను ఆనుకుని 50 గజాల్లో అక్రమం గా ఈ భవనాన్ని నిర్మించారు. ఈ నిర్మాణం కూలిన పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌పై శకలాలు పడ్డాయి. భయంతో పక్కనే ఉన్న హాస్టల్లోకి విద్యార్థులు పరుగులు తీశారు. ఈ సంఘటన స్థలానికి హైడ్రా, డీఆర్‌ఎఫ్ టీమ్స్ చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. సీఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఈ భవనం నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గతంలో ఈ నిర్మాణానికి సీఎంసీ టౌన్ పానింగ్ అధికారులు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. క్షేత్రస్థాయిలో ..మిగతా 2లో



## తెలంగాణలో విద్యావ్యవస్థ పటిష్టతకు

# కేంబ్రిడ్జ్ సహకారం

## యూనివర్సిటీ ప్రతినిధులతో సీఎం రేవంత్ చర్చలు

కేంబ్రిడ్జ్, లండన్ వర్సిటీలను సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి

విద్య, పరిశోధనల్లో భాగస్వామ్యంపై చర్చ

లండన్ కేంబ్రిడ్జ్, లండన్ వర్సిటీలను సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి బృందం

విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్యంపై కేంబ్రిడ్జ్ ప్రతినిధులతో చర్చ

హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు పెట్టాలని కోరిన సీఎం బృందం



**లండన్ ఆగస్టు 22 :**

లండన్‌లోని ప్రఖ్యాత కేంబ్రిడ్జ్, లండన్ వర్సిటీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం సందర్శించింది. విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్యంపై కేంబ్రిడ్జ్ ప్రతినిధులతో సీఎం చర్చించారు. హైదరాబాద్‌లో ఎడ్యుకేషన్, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లు పెట్టాలని కోరారు. యువపారిశ్రామికవేత్తలకు ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పష్టమైన కార్యచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని ఇరువర్గాలు నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్ర మానికి మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు రామకృష్ణారావు, ప్రత్యేక సీఎస్ జయేశ్ రంజన్‌లు హాజరయ్యారు. మరోవైపు సీఎం రేవంత్ పర్యటనకు కేంద్రం నో చెప్పడాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుపట్టారు. లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక ..మిగతా 2లో

## 22ఎ నిషేధిత జాబితా పేరుతో

# వేధింపులు

## ప్రజలను ఇబ్బంది పెట్టే అధికారం ఎక్కడిది

## ఉప్పల్ బాధితులతో హరీష్ రావు

**హైదరాబాద్, ఆగస్టు 22 :**

నిషేధిత జాబితా పేరుతో ప్రజల భూములను కబ్జా చేసే హక్కు ఎవరు ఇచ్చారని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇది 30శాతం కమిషన్ సర్కార్ అని ప్రజలే అంటున్నారని తెలిపారు. హైదరాబాద్ బోడుప్పల్ పరిధిలోని తిరుమల మెడోస్, లక్ష్మీ గణపతి కాలనీ, హేమానగర్ కాలనీలకు చెందిన వందలాది మంది 22ం బాధితులు వచ్చి తమ ఆవేదన చెబుతుంటే గుండె కలిచివేసిందని అన్నారు. సర్వే నంబర్ 215, 215 పార్ట్‌లలో 30 ఏళ్లుగా ఎలాంటి వివాదాలు లేకుండా సుమారు 1,500 కుటుంబాలు నివసిస్తున్న ఇళ్లను రాత్రికి రాత్రే కాంగ్రెస్ ప్రభుత్వం అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద 22ఎ నిషేధిత జాబితాలో చేర్చడం అత్యంత దుర్మార్గమని హరీశ్‌రావు ..మిగతా 2లో



# దానం నాగేందర్ అనర్హత పిటిషన్





## తీర్పును రిజర్వ్ చేసిన హైకోర్టు

**హైదరాబాద్, ఆగస్టు 22 :**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. సెప్టెంబర్ 16వ తేదీన తుది తీర్పు ఇవ్వనున్నట్లు జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ధర్మాసనం శనివారం వెల్లడించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్‌ను కొట్టివేస్తూ స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో బీఆర్‌ఎస్ నాయకులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణలో భాగంగా, దానం నాగేందర్ బీఆర్‌ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరి, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ కూడా చేశారని బీఆర్‌ఎస్ తరపు న్యాయవాదులు కె.వివేక్ రెడ్డి, గండ్ర మోహన్ రావు

# నాలుగేళ్ల లోపు చిన్నారుల మందులపై కేంద్రం ఆంక్షలు

క్లోర్‌ఫెనిరమైన్, ఫినైల్‌ఫ్రైన్ ఉన్న ఎఫ్‌డీసీ మందులకు ఇది వర్తింపు

మందుల లేబుల్‌పై హెచ్చరిక తప్పనిసరిగా ముద్రించాలని ఆదేశం

నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం

ఈ మందుల తయారీ, అమ్మకాలు, పంపిణీపై పరిమితులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 22:**

చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నాలుగేళ్ల లోపు చిన్నారులకు క్లోర్‌ఫెనిరమైన్ మలేట్, ఫినైల్‌ఫ్రైన్ హైడ్రోక్లోరైడ్‌తో కూడిన ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ (ఎఫ్‌డీసీ) ఔషధాల వాడకంపై కేంద్రం ఆంక్షలు విధించింది. ఈ ఔషధాల తయారీ, విక్రయాలు, పంపిణీని పరిమితం చేస్తూ ..మిగతా 2లో



# తెలంగాణ పోలీస్ అకాడమీలో రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి
# 157వ జయంతి వేడుకలు

**హైదరాబాద్, ఆగస్టు 22:**

రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి 157వ జయంతి వేడుకలు రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో అకాడమీ అధికారులు మరియు ఆర్‌బీవీఆర్‌ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమీ ప్రాంగణంలోని రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి విగ్రహానికి అకాడమీ అధికారులు, ఆర్‌బీవీఆర్‌ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రతినిధులు, పోలీస్ అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పోలీస్ వ్యవస్థకు వెంకట రామిరెడ్డి ఆదర్శంఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ కె.ఆర్.కె. ప్రసాద్ మాట్లాడుతూ... రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి పేరు తెలంగాణ పోలీస్ అకాడమీకి, మొత్తం పోలీస్ వ్యవస్థకు నిరంతర స్ఫూర్తినిస్తోందని అన్నారు. పేదలు, బలహీన వర్గాల ప్రజలకు వెంకట రామిరెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని, పోలీస్ సేవలకు ఆయన ఒక నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ శిక్షణార్థుల సంక్షేమం కోసం ఆయన ఏర్పాటు చేసిన నిధి ద్వారా శిక్షణార్థుల పట్ల ఆయనకున్న శ్రద్ధ, దూరదృష్టి స్పష్టంగా తెలుస్తుందని తెలిపారు. అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ఆయన పేరుతో తెలంగాణ పోలీస్ అకాడమీని మరింత అభివృద్ధి చేసుకోవడం గర్వకారణమని, భవిష్యత్ పోలీస్ అధికారులకు ఆయన జీవితం, సేవలు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు.

**విద్యారంగంలో విశేష సేవలు**

ఆర్‌బీవీఆర్‌ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షుడు కొండ లక్ష్మీకాంతరెడ్డి మాట్లాడుతూ, రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేశారని





తెలిపారు.

విద్య ద్వారా సమాజ అభివృద్ధికి బాటలు వేసేందుకు అనేక విద్యాసంస్థలను ఏర్పాటు చేసి, ఎంతోమందికి విద్యావకాశాలు కల్పించిన ఆయన సేవలను కొనియాడారు. సమాజ సేవ, విద్యాభివృద్ధి, ప్రజాసేవలో ఆయన చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శప్రాయమని అన్నారు....

**వెంకట రామిరెడ్డి పోలీసింగ్ శైలి ఆదర్శనీయం**

రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ తిరుపతి రెడ్డి రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి బాల్యం, ఆయన ఎదిగిన తీరు, పోలీస్ శాఖలోకి వచ్చిన విధానం తదితర అంశాలను వివరించారు.

నిజాం కాలంలో హైదరాబాద్ కొత్వాల్‌గా ఆయన నిర్వహించిన బాధ్యతలు, ప్రజలతో ఆయన వ్యవహరించిన తీరు, పోలీసింగ్‌లో ఆయన అనుసరించిన ప్రత్యేక విధానాన్ని వివరించారు. ప్రజల భద్రత, సంక్షేమం, క్రమశిక్షణకు ప్రాధాన్యతనిస్తూ ఆయన అందించిన పోలీస్ సేవలు నేటి పోలీస్ అధికారులకు స్ఫూర్తిదాయకమని తెలిపారు.

ప్రస్తుత పోలీస్ అధికారులు, శిక్షణార్థులు రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

**ప్రత్యేక అతిథులకు జ్ఞాపికలు**

కార్యక్రమం అనంతరం ఆర్‌బీవీఆర్‌ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షుడు కొండ లక్ష్మీకాంతరెడ్డి, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ తిరుపతి రెడ్డిలకు తెలంగాణ పోలీస్ అకాడమీ తరఫున జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ కె.ఆర్.కె. ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్లు వేమా శ్రీనివాసరెడ్డి, యార్లగడ్డ రాంబాబు, వేముల శ్రీనివాసరావు, నరహరి, డీఎస్పీలు ఆదూరి శ్రీనివాసరావు, కృష్ణ, తోట శ్రీనివాసులు, తిరుపతి, జగదీశ్వర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, అకాడమీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తిని స్మరించుకుంటూ నిర్వహించిన ఈ జయంతి కార్యక్రమం ఘనంగా విజయవంతమైంది.

# తెలంగాణలో విద్యావ్యవస్థ పటిష్టతకు
# కేంబ్రిడ్జ్ సహకారం

**మొదటి పేజీ తరువాయి...**

వ్యవస్థకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు లండన్‌లోని లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగం ఆసక్తి చూపింది. భాగస్వామ్య ఒప్పందం చేసుకునేందుకు లివర్‌పూల్ ప్రతినిధి బృందం అక్టోబర్‌లో హైదరాబాద్ రానుంది. లండన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇవాళ లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగానికి చెందిన సుసాన్ ఫిన్నెగాన్, నూలా గల్లాఘర్, లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్‌కు చెందిన పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు.

తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి : లండన్‌లోని ప్రఖ్యాత ఇంపీరియల్ కాలేజీని సీఎం సలహాదారు రామకృష్ణారావు సందర్శించారు. ఇంపీరియల్ కాలేజీ చీఫ్ ఆఫ్ స్టాఫ్, అమాండా వోల్తుయిజెన్, దక్షిణాసియా సీనియర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ మేనేజర్ రొసాన్నా గిల్లెస్పీతో రామకృష్ణారావు సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో షార్ట్ టర్మ్ కోర్సులు, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తామని అమాండా తెలిపారు. పరిశోధన రంగంలో భాగస్వామ్యం విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలపై కూడా తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి చూపారు. డిసెంబరులో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ఇంపీరియల్ కాలేజీ ప్రతినిధులను రామకృష్ణారావు ఆహ్వానించారు.

కేంద్రం ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుంటోంది : సీఎం



రేవంత్ రెడ్డి లండన్ పర్యటన రేపటితో పూర్తవ్వనుంది. ఆయన అమెరికా పర్యటనకు కేంద్రం నో చెప్పడంతో లండన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుపట్టారు. పెట్టుబడుల కోసం వెళ్లే పర్యాటనలను అడ్డుకోవడం ముమ్మాటికీ అన్యాయమేనని ఆయన అభిప్రాయపడ్డారు. బీజేపీ పెద్దలు తమకు కావాల్సిన వారికి అనుమతి ఇస్తారని, తెలంగాణ సీఎంకు మాత్రం విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు.

అమెరికాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉన్నారని, పెట్టుబడులు వస్తే తెలంగాణతో పాటు దేశానికి కూడా లాభమేనన్నారు. కేంద్రం ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి పర్యటనలను అడ్డుకుంటోందని ఖర్గే ఆరోపించారు. ముఖ్యమంత్రులు వెళ్లి పెట్టుబడులు తెస్తారనే భయం వారిలో ఉందన్నారు. అన్నీ తమ ద్వారా జరగాలనేది కేంద్రం సంకుచిత ఆలోచన అని ఖర్గే విమర్శించారు.

లండన్ యూనివర్సిటీని సందర్శించిన సీఎం రేవంత్ : హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు లండన్ యూనివర్సిటీ ప్రతినిధులు సీఎంకు తెలిపారు. లండన్ యూనివర్సిటీ ప్రతినిధులు అక్కడి సెనేట్ హౌస్‌లో సీఎం రేవంత్ రెడ్డి బృందంతో చర్చించింది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్, స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ ప్రతినిధి బృందాలు కూడా పాల్గొన్నాయి. యూనివర్సిటీకి చెందిన వివిధ స్కూళ్లు, విభాగాల ద్వారా ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లు అందించేలా హైదరాబాద్‌లో క్యాంపస్‌ను ఏర్పాటుకు యోచిస్తున్నట్టు యూనివర్సిటీ ప్రతినిధులు వివరించారు.

లండన్ యూనివర్సిటీకి చెందిన వివిధ విద్యా విభాగాలను ఒకే అకడమిక్ ఫెడరేషన్‌గా అనుసంధానించే విధంగా ఈ కార్యక్రమాలు కొనసాగనున్నాయని చెప్పారు. అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించినందున.. సీఎం రేవంత్‌రెడ్డి లండన్ పర్యటన ఇవాళ ముగించుకొని హైదరాబాద్ బయలుదేరనున్నారు. సీఎం సలహాదారు రామకృష్ణరావు, ప్రత్యేక సీఎస్ జయేష్ రంజన్ తదితరులు అమెరికా వెళ్లి హార్వర్డ్, ఎంఐటీ, నార్త్ ఈస్టర్న్, వర్జీనియా టెక్ వంటి ప్రముఖ యూనివర్సిటీలను సందర్శించి పలు ఎంవోయూలు చేసుకోనున్నారు.

# 22ఎ నిషేధిత జాబితా పేరుతో
# వేధింపులు

**మొదటి పేజీ తరువాయి...**

మండిపడ్డారు. కష్టాల్లో ఉన్నప్పుడు ఇల్లు అమ్ముకుందామని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్తే.. ఆస్తి ప్రొహిబిషన్‌లో ఉందన్న విషయం తెలియడంతో కాలనీ వాసులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని అన్నారు. చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ అయిన ఇళ్లను అడ్డుపెట్టుకుని ప్రజలపై ఒత్తిడి తెచ్చి 30 శాతం కమీషన్లు దండుకునేందుకే ఇలాంటి కృత్రిమ వివాదాలు సృష్టిస్తున్నారని రాష్ట్ర వ్యాప్తంగా కోడై కూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ప్రశాంతంగా జీవిస్తున్న ప్రజలకు ఇప్పుడు 22ఎ భయం చూపిస్తూ, బినామీలతో సెటిల్మెంట్లు చేసుకునే దందాకు తెరలేపారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. దీనికి మీ సమాధానం ఏంటని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. బోడుప్పల్ కాలనీ వాసులు సహా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న



బాధితులందరూ అధైర్యపడవద్దు. ఈ వసూళ్ల సర్కార్ మెడలు వంచైనా సరే మీ ఆస్తులను కాపాడే బాధ్యతను బీఆర్‌ఎస్ పార్టీ తీసుకుంటుందని స్పష్టం చేశారు. మాటలు పక్కనబెట్టి, తక్షణమే ఆయా కాలనీలను 22ఎ నిషేధిత జాబితా నుంచి తొలగించి, బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే బాధితుల పక్షాన బీఆర్‌ఎస్ పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని హెచ్చరించారు.




# నాలుగేళ్ల లోపు చిన్నారుల మందులపై
# కేంద్రం ఆంక్షలు

**మొదటి పేజీ తరువాయి...**

నోటిఫికేషన్ విడుదల చేసింది. సాధారణంగా జలుబు, దగ్గు, అలర్జీ వంటి సమస్యల నివారణకు వాడే ఔషధాలలో ఈ కాంబినేషన్‌ను వినియోగిస్తారు. ఇకపై ఈ మందుల లేబుల్స్, ప్యాకేజీలపై "ఈ ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్‌ను నాలుగేళ్ల లోపు పిల్లలకు ఇవ్వరాదు" అనే హెచ్చరికను తప్పనిసరిగా ముద్రించాలని ఔషధ తయారీ సంస్థలను ప్రభుత్వం ఆదేశించింది. నిపుణుల కమిటీ, డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్ (డీటీఏబీ) చేసిన సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

గతంలో 2025 ఏప్రిల్ 15న ఈ సమ్మేళనాలు కలిగిన కొన్ని ఎఫ్‌డీసీ మందులపై మాత్రమే ప్రభుత్వం ఇలాంటి ఆంక్షలు విధించగా, తాజా ఉత్తర్వుల ద్వారా ఈ నిబంధనను అన్ని రకాల ఫార్ములేషన్లకు వర్తింపజేసింది. నాలుగేళ్ల లోపు చిన్నారులపై ఈ మందులు ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని, వీటికి బదులుగా సురక్షితమైన ప్రత్యామ్నాయ ఔషధాలు అందుబాటులో ఉన్నాయని నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్-1940లోని సెక్షన్ 26ఎ కింద కేంద్ర ప్రభుత్వం ఈ నోటిఫికేషన్‌ను జారీ చేసింది.



# మెట్రో రెండో దశలో
# సరికొత్త హంగులు

ప్రతిపాదించారు. మదీనాగూడ, చందానగర్ మధ్య 1.2 కి.మీ పొడవైన డబుల్ డెక్‌లో ఫ్లైఓవర్, రెండో ఎలివేటెడ్ మెట్రో వెళ్లేలా డిజైన్ చేశారు.

శంషాబాద్ విమానాశ్రయానికి సంబంధించి కార్గో విమానాశ్రయ స్టేషన్లతో పాటు విమానాశ్రయ ప్రాంగణంలోనే మెట్రో డిపో ఏర్పాటు ప్రతిపాదనలు ఉన్నాయి. దీనికి ఆమోదం తెలపాలని మెట్రో అధికారులు పౌర విమానయాన శాఖను కోరారు. బేగంపేట విమానాశ్రయ రన్‌వే చుట్టూ ఉన్న 'ఫన్నెల్ జోన్'లో ఎత్తుకు సంబంధించిన పరిమితులు ఉన్నాయి. అందువల్ల శామీర్‌పేట, మేడ్చల్ మెట్రో కారిడార్లను తక్కువ ఎత్తులో నిర్మించేలా ప్రణాళిక చేశారు. ఈ మార్గాలకు అనుమతి కావాలని కోరారు.

రైల్వే క్రాసింగ్‌లు : మెట్రో మార్గం ఫలక్‌నుమా, ఆరాంఘర్, శంషాబాద్, గుండ్లపోచంపల్లి, లోతుకుంట, అల్వాల్ వద్ద రైల్వే ట్రాక్‌లను దాటాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి దక్షిణ మధ్య రైల్వే నుంచి ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం లభించింది. అయితే సుచిత్ర ప్రాంతానికి సంబంధించిన అనుమతి ఇంకా పెండింగ్‌లో ఉంది.

జాతీయ రహదారి మార్గాలు : చీఎ-65 (మదీనాగూడ నుంచి పటాన్‌చెరు వరకు, చింతలకుంట నుంచి హయత్ నగర్ వరకు) చీఎ-44 (ఆరాంఘర్ నుంచి శంషాబాద్ వరకు, బోయిన్‌పల్లి నుంచి మేడ్చల్ వరకు) వెంబడి మెట్రో పిల్లర్ల నిర్మాణానికి సంబంధిత అధికారులు 'రైట్ ఆఫ్ వే' అనుమతులను మంజూరు చేయాల్సి ఉంది.

కేంద్రం వాటా : రూ.6,666 కోట్లు (17%)

రాష్ట్రం వాటా : రూ.11,933 కోట్లు (31%)

రుణాలు : రూ.19,996 కోట్లు (52%)

వివిధ కార్పొరేషన్ల పరిధిలో విస్తరణ : ప్రతిపాదిత రెండో దశ మార్గం జీహెచ్ఎంసీ పరిధిలో 36.5 కి.మీ, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 24.9 కి.మీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 41.3 కి.మీ మేర విస్తరించి ఉంది. ఇంకా 'రైట్ ఆఫ్ వే' అనుమతులను వేగవంతం చేయాలని మెట్రో రైలు అధికారులు హెచ్ఎండీఏ కంటోన్మెంట్ బోర్డును కోరారు.

ప్రతిపాదన వివరాలు :

కారిడార్లు: 7

దూరం: 122.9 కి.మీ

స్టేషన్లు: 86

ప్రాజెక్ట్ వ్యయం: రూ.38,595 కోట్లు

ప్రయాణికులు: 12.42 లక్షలు



# దానం నాగేందర్ అనర్హత పిటిషన్

**మొదటి పేజీ తరువాయి...**

కోర్టుకు వివరించారు. పార్టీ మారినట్టు అన్ని ఆధారాలు ఉన్నా స్పీకర్ అనర్హత పిటిషన్ కొట్టివేశాడని వెల్లడించారు. తాను ఇంకా బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని ఫిరాయింపు ఎమ్మెల్యేల తరపు న్యాయవాదులు కోర్టుకు వెల్లడించారు. ఇరు వర్గాల వాదనలు విని తుది తీర్పును రిజర్వ్ చేస్తూ, సెప్టెంబర్ 16వ తేదీకి వాయిదా వేసింది.

# గచ్చిబౌలిలో కుప్పకూలిన
# ఏడంతస్తుల భవనం

**మొదటి పేజీ తరువాయి...**

టౌన్ ప్లానింగ్ అధికారులకు ముడుపులిచ్చి ఈ భవనాన్ని యజమాని నిర్మిస్తున్నట్లు సమాచారం. క్రమంగా బిల్డింగ్ నిర్మాణాన్ని ఖాజా అనే వ్యక్తి చేపట్టాడు. అంజయ్య నగర్‌లో అత్యంత ప్రమాదకర స్థాయిలో భవనాల నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఖాజా నిర్మిస్తున్న అక్రమ భవనంపై పలుమార్లు పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ వాసులు ఫిర్యాదు చేశారు. అయిన హైడ్రా, సీఎంసీ సిబ్బంది పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండేళ్ల క్రితం ఇదే అంజయ్య నగర్‌లో ఐదు అంతస్తుల భవనం పక్కకు ఒరిగింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# జీవో నంబర్ 97 రద్దు చేయాలి

**-బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి సంఘాల నిరసన...**



**చంద్రుగొండ/జూలూరుపాడు(భద్రాద్రి న్యూస్)ప్రతినిధి:** పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం కలిగించేలా ఉన్న జీవో నంబర్ 97ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపు మేరకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి సెంటర్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జీవో నంబర్ 97ను రద్దు చేసి విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 97 రాష్ట్రంలోని పాలిటెక్నిక్( డిప్లమా) విద్య వ్యవస్థను మరియు కళాశాలలను యాంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ప్రతిపాదించింది.ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తున్నారు వారి పోరాటనికి బిఆర్ఎస్ పార్టీ మద్దతు తెలుపుతూ నిరసన కార్యక్రమం నిర్వహించమని అన్నారు.స్కిల్ వర్సిటీలో పాలిటెక్నిక్ కాలేజీల విలీనానికి కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన శక్తి స్కీమ్ తొలిగించాలని జీవో నెంబర్ 97ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేనియెడల విద్యార్థుల పక్షాన బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేసి కాంగ్రెస్ ప్రభుత్వనికి తగిన బుద్ధి చెపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారా వెంకటేశ్వరరావు(బాబు),గంపెన సొసైటీ వైస్ ఛైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ, జిల్లా నాయకులు మేడ మోహన్ రావు,యువజన విభాగం నాయకులు మద్దుకూరు ఉప సర్పంచ్ శ్రవణ్, చంద్రుగొండ రెండో వార్డు నెంబర్ సూరా వెంకటేశ్వర్లు, భూపతి శ్రీను,యాకుబ్ పాల్గొన్నారు

# బీసీ మహిళలకు 'ఇందిరమ్మ కుట్టు మిషన్లు

***- 100 శాతం సబ్సిడీతో ఆటోమేటిక్ మిషన్లు***




**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 22 (భద్రాద్రి న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వెనుకబడిన తరగతుల (బీసీ) కులాలకు చెందిన నిరుద్యోగ మహిళలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్ల పంపిణీ పథకం' ప్రారంభించినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పి. విజయలక్ష్మి తెలిపారు. ఈ పథకం కింద అర్హులైన మహిళలకు ఆటోమేటిక్ కుట్టు మిషన్లను 100 శాతం సబ్సిడీతో అందించనున్నట్లు వెల్లడించారు. ఈ పథకానికి అర్హులైన మహిళల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు్ స్త్రశీఎఎఎం.ఎ్రస్త్ర.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా 2026 సెప్టెంబర్ 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ పేరును మార్చాలి

**- 'కొత్తగూడెం' లేదా 'భద్రాద్రి కొత్తగూడెం' గా మార్చాలని కోరుతూ రైల్వే అధికారులకు విజ్ఞప్తి**




**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 22 (భద్రాద్రి న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కీలకమైన భద్రాచలం రోడ్డు (బిడిసిఆర్) రైల్వే స్టేషన్ పేరును మార్చాలన్న డిమాండ్ మరోసారి తెరపైకి వచ్చింది. స్టేషన్ పేరును 'కొత్తగూడెం' లేదా 'భద్రాద్రి కొత్తగూడెం' గా మార్చాలని కోరుతూ ప్రజాప్రతినిధులు రైల్వే అధికారులను కలిసి విజ్ఞప్తి చేశారు. ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తదితరులు సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌ను కలిసి స్టేషన్ పేరు మార్పు అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం 'భద్రాచలం రోడ్డు'గా పిలుస్తున్న ఈ రైల్వే స్టేషన్ వాస్తవానికి కొత్తగూడెం పట్టణ పరిధిలో ఉంది. భద్రాచలం పట్టణం స్టేషన్‌కు సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీంతో కొత్తగూడెంకు వచ్చే ప్రయాణికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి స్టేషన్ పేరు కొంత గందరగోళానికి గురిచేస్తోందని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు.

# పార్థీనియం (హిస్టెరోఫోరస్ గడ్డి) నిర్మూలనకు సమిష్టి చర్యలు



**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 22 (భద్రాద్రి న్యూస్) :** పార్థీనియం (హిస్టెరోఫోరస్ గడ్డి) వల్ల కలిగే హానికర ప్రభావాలపై ప్రజలు, రైతులు అవగాహన పెంచుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) భద్రాద్రి కొత్తగూడెం సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ డా.టి.భరత్ అన్నారు. శనివారం కేవీకేలో నిర్వహించిన పార్థీనియం అవగాహన వారోత్సవం కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా.టి.భరత్ మాట్లాడుతూ... పార్థీనియం హిస్టెరోఫోరస్ మొక్క వల్ల మానవులు, పశువులు, పర్యావరణంపై ప్రతికూల ప్రభావాలు ఉంటాయని వివరించారు. పార్థీనియం పుప్పొడి, మొక్క భాగాలతో సంబంధం ఏర్పడితే మనుషుల్లో హే ఫీవర్, బ్రాంకైటిస్, ఆస్తమా, చర్మ అలర్జీలు వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. పార్థీనియం కలిసిన మేతను పశువులు తీసుకోవడం లేదా నిరంతరం ఆ మొక్కకు గురికావడం వల్ల వాటి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. ముఖ్యంగా గేదెల్లో పాల ఉత్పత్తి తగ్గే అవకాశం ఉందన్నారు. పార్థీనియంను ప్రారంభ దశలోనే గుర్తించి, సరైన యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా దాని వ్యాప్తిని నియంత్రించవచ్చని సూచించారు. వ్యవసాయ క్షేత్రాలు, పరిసర ప్రాంతాల్లో పార్థీనియం నిర్మూలనకు రైతులు, సిబ్బంది సమిష్టిగా చర్యలు తీసుకోవాలని అవగాహన కల్పించారు.

# ఖమ్మం బాల్ బ్యాట్మెంటన్ సబ్ జూనియర్స్ జట్టు ఎంపిక





**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 22( భద్రాద్రిన్యూస్ ):-** ఉమ్మడి ఖమ్మం జిల్లా సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ బాలబాలిక జట్లులను ఎంపిక చేశామని కల్లూరు వ్యాయామ ఉపాధ్యాయులు పసుపులేటి వీరరాఘవయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కల్లూరు గ్రీన్ ఫీల్డ్ మినీ స్టేడియం క్రీడా ప్రాంగణం నందు రెండు జిల్లాల పరిధిలో జరిగిన సబ్ జూనియర్ బాల బాలికల జిల్లా జట్ల ఎంపికల లో బాలికలు 40 మంది బాలురు 60 మంది పాల్గొన్నారని తెలిపారు. అత్యంత ప్రతిభ కనపరిచి న క్రీడాకారులను పది మంది బాలురను, పదిమంది బాలికలను ఎంపిక చేసామని, ఎంపిక అయినటువంటి క్రీడాకారులు ఈనెల 28, 29 ,30 తేదీలలో తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీలు బి.హెచ్. ఈ ఎల్ హైదరాబాదు నందు నిర్వహించబడతాయని ఈ పోటీలలో ఖమ్మం జిల్లా జట్టు పాల్గొంటారని తెలిపారు . ఈ పోటీల నిర్వహణ బాధ్యతను ఖమ్మం జిల్లా బాల్ బ్యాట్మెంటన్ జనరల్ సెక్రటరీ బొంతు శ్రీనివాసరావు ,అధ్యక్షుడు వెజిల్ల సురేష్, కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ఉ న్నం నాగేశ్వరరావు క్రీడల నిర్వహణ బాధ్యతల ను కల్లూరు మండల వ్యాయామ ఉపాధ్యాయులు వ్యాయామ ఉపాధ్యాయులు తోడ్పాటు నందించి పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఎంపికకు వచ్చినటువంటి క్రీడాకారులకు అబ్దుల్ రహీం ,మోటమర్రి ప్రభాకర్ ,సీనియర్ బాల్ బ్యాట్మెంటన్ క్రీడాకారులు సత్యం పేరున పిల్లలకు ఉచిత భోజన వసతి ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శిక్షకులు పసుపులేటి వీర రాఘవయ్య ,తల్లపు రెడ్డి గౌతం, రజిని ,శ్రీదేవి ,పద్మ ,రమాకుమారి, వెంకటేశ్వర్ రావు సీనియర్ క్రీడాకారులు చెంగపొంగు సైదులు , జగదీష్ ,గోపి ,వ్యాయామ ఉపాధ్యాయులు, వ్యాయామ దర్శకులు, తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి కొత్తగూడెంకు చారిత్రాత్మక విజయం

**- జూనియర్ షూటర్ అయ్మాన్ ముస్కాన్ పఠాన్ గోల్డ్ మెడల్‌తో సత్తా**

**- టోర్నమెంట్‌లో అత్యధికంగా 98/100.**










**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 22(భద్రాద్రిన్యూస్):** గ్రామీణ క్రీడా ప్రతిభకు చారిత్రాత్మక విజయంగా, జూనియర్ షూటర్ అయ్మాన్ ముస్కాన్ పఠాన్ 2వ తెలంగాణ సూపర్ బిగ్ బోర్ పోటీలు -- 2026లో బంగారు పతకం సాధించారు. ఆమె 100కి 98 పాయింట్లు సాధించి, మొత్తం పోటీల్లోనే అత్యధిక స్కోర్ నమోదు చేశారు. ఈ విజయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. సూపర్ బిగ్ బోర్ రైఫిల్ విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు తొలి పతకం దక్కింది.
తెలంగాణ రైఫిల్ సంఘం ఆధ్వర్యంలో 2026 ఆగస్టు 20, 21 తేదీల్లో ఈ పోటీలను హైదరాబాదులో ఆక్టోపస్ కమాండో శిక్షణ కేంద్రంలో నిర్వహించారు. అయ్మాన్ ముస్కాన్ పఠాన్ తన బంగారు పతకాన్ని మాజీ డీజీపీ అంజనీ కుమార్, తెలంగాణ రైఫిల్ సంఘం అధ్యక్షుడు మరియు జాతీయ రైఫిల్ సంఘం ఉపాధ్యక్షుడు అమిత్ సంఘీ చేతుల మీదుగా అందుకున్నారు.

# హౌస్ కీపర్లు,ఆఫీస్ సబార్డినేట్లను జేపీఏలుగా కన్వర్షన్ చేయండి

**- బీటీపీయస్ చీఫ్ ఇంజనీర్ బిచ్చన్న కు వినతిపత్రం ఇచ్చిన టి ఎస్ పి ఈ యు-1535 నాయకులు..**



**పాల్వంచ, ఆగస్టు22 (భద్రాద్రి న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిటిపిఎస్ లో పనిచేస్తున్న హౌస్ కీపర్లు,ఆఫీస్ సబార్డినేట్లను జేపీఏ ( జూనియర్ ప్లాంట్ అటెండెంట్ )లుగా కన్వర్షన్ చేయాలని ( తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్)-1535 నాయకులు ఆ కర్మాగార చీఫ్ ఇంజనీర్ బి.బిచ్చన్న ను కోరారు.టి ఎస్ పి ఈ యు1535 రీజినల్ అధ్యక్షులు వి. ప్రసాద్, స్టేట్ జాయింట్ సెక్రటరీ ఏ. వెంకటేశ్వర్లు, కోశాధికారి పి. శ్రీనివాస్ తదితరులు బిటిపిఎస్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో శనివారం ఆయన కలసి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొని వెళ్లారు. 31,ఆగస్టు2026 తేది వరకు ఐదు ఇంక్రిమెంట్లు తీసుకున్న హౌస్ కీపర్ లను జేపీలుగా కన్వెన్షన్ చేసేందుకు జెన్కో ఇటీవల సర్కులర్ విడుదల చేసిందని చెప్పారు. అయితే ఈ గడువుని 30,నవంబర్2026 వరకు పొడగించాలని కోరారు.ఈ మూడు నెలలు పొడిగిస్తే హౌస్ కీపర్ లందరూ జెపిఎ లుగా కన్వర్షన్ అవుతారని గుర్తు చేశారు. కర్మాగారం లో ఐదు సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసీ...పదో తరగతి పాసైన ఆఫీస్ సబర్డేనేట్ల అందరిని జెపిఎ లుగా కన్వర్షన్ చేసే జీవో ఉందని చెప్పారు. ఈ జీవో ను అనుసరించి ఆఫీస్ సబార్డినేట్లను జెపిఎ గా కన్వర్షన్ చేయాలని కోరారు. భూ నిర్వాసిత కోటాలో నియమితులైన జూనియర్ అసిస్టెంట్ల సర్వీసును డేటాఫ్ జాయినింగ్, డేట్ అఫ్ బర్త్ ను పరిగణలోకి తీసుకొని నిర్ణయించాలని పేర్కొన్నారు. హౌస్ కీపర్ లకు గడువు పెంచేందుకు,ఆఫీస్ సబార్డినేట్లను జెపిఎలు గా కన్వర్షన్ చేసేందుకు చీఫ్ ఇంజనీర్ సానుకూలంగా స్పందించారు. జూనియర్ అసిస్టెంట్ల సీనియారిటీని నిబంధనలను అనుసరించి నిర్ణయిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆఫీస్ సబార్డినేట్లు గౌస్ పాషా,కళ్యాణ్, రాము, నరసింహారావు, అప్పియ,కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# పెనగడప వైద్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

**- ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సిబ్బందికి డీఎంహెచ్ఓ తుకారం రాథోడ్ సూచనలు**



**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 22 (భద్రాద్రి న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చుంచుపల్లి మండలంలోని పెనగడప వైద్య ఆరోగ్య కేంద్రాన్ని శనివారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రతాప్‌తో కలిసి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డిఎండహెచ్ఓ) డాక్టర్ తుకారం రాథోడ్ పరిశీలించి విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ప్రయోగశాల, ఫార్మసీ, వార్డు, ఐఎల్ఆర్ తదితర విభాగాలను పరిశీలించారు. రికార్డులు, హాజరు రిజిస్టర్, సెలవు వివరాలు, వివిధ లేఖలు తదితర పత్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. అనంతరం పెనగడప గ్రామంలో నిర్వహించిన దోమల నివారణ మందు పిచికారీ కార్యక్రమంలో అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు గ్రామాల్లో పారిశుధ్యం, దోమల నియంత్రణ చర్యలు నిరంతరం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెనగడప వైద్య ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## జీవో 97కు వ్యతిరేకంగా పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళన



**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 22 (భద్రాద్రి న్యూస్) :** పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నంబర్ 97ను తక్షణమే రద్దు చేయాలని బీఆర్ఎస్వీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకుడు జూపెల్లి దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో జీవో 97కు వ్యతిరేకంగా నిర్వహించిన నిరసనలో ఆయన పాల్గొని మాట్లాడారు. జీవో 97 ద్వారా పాలిటెక్నిక్, డిప్లొమా కోర్సులను శక్తి విభాగం, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు. దీంతో రాష్ట్రంలోని సుమారు 75 వేల మంది పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. పాలిటెక్నిక్ విద్యను ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య విధానంలోకి తీసుకెళ్లడం, స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే చర్యగా ఆయన అభివర్ణించారు. అలాగే డిప్లొమా విద్యార్థులకు ఉన్న ఈసెట్ ద్వారా బీటెక్‌లో లాటరల్ ఎంట్రీ అవకాశాలపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సాంకేతిక డిప్లొమా విద్యా ప్రమాణాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జీవో 97ను వెంటనే నిలిపివేయకపోతే విద్యార్థుల పక్షాన రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గూడెల్లి ముఖేష్, వాసు, మల్ల గౌతమ్, రవితేజ, నజీర్, సన్నీ పాల్గొన్నారు.

# సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై జాతీయ ఎస్సీ కమిషన్ సమీక్ష



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 22 (భద్రాద్రి న్యూస్) :** సింగరేణి కాలరీస్ సంస్థలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలు, రిజర్వేషన్ల అమలు, బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ తదితర అంశాలపై జాతీయ ఎస్సీ కమిషన్ ప్రత్యేక దృష్టి సారించింది. శనివారం హైదరాబాద్ మాదాపూర్ హైటెక్‌సిటీలోని ట్రైడెంట్ హోటల్‌లో కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ అధ్యక్షతన సింగరేణి ఉన్నతాధికారులు, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో వేర్వేరుగా సమీక్ష నిర్వహించారు. సుమారు మూడు గంటలపాటు జరిగిన సమావేశంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై అసోసియేషన్ ప్రతినిధులు కమిషన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగులపై పక్షపాత వైఖరితో ఛార్జ్‌షీట్లు, సస్పెన్షన్లు, కంపల్సరీ రిటైర్మెంట్లు వంటి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నారని ఆరోపించారు. విజిలెన్స్ విచారణల సమయంలో వేధింపులు, ఒత్తిడి తెచ్చి సంతకాలు చేయించుకుంటున్నారని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ పరిధిలోని పాఠశాలలు, ఉమెన్స్ కాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో అడ్‌హాక్, తాత్కాలిక బోధన, బోధనేతర పోస్టుల భర్తీలో రిజర్వేషన్లు అమలు చేయడం లేదని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఉన్నప్పటికీ మూడేళ్లుగా ఎనిమిది సర్వేయర్ బ్యాక్‌లాగ్ పోస్టులతో పాటు హిందీ పండిట్ పోస్టులను భర్తీ చేయలేదని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి డైరెక్టర్ (పా) ఆధ్వర్యంలో ప్రతి మూడు నెలలకోసారి సమీక్ష సమావేశం నిర్వహించాలని ప్రతినిధులు కోరారు. ఉద్యోగుల సమస్యలు, ప్రమోషన్లకు సంబంధించిన అంశాలను పరిగణనలోకి తీసుకున్న జాతీయ ఎస్సీ కమిషన్ ప్రతినిధులు.. సింగరేణి యాజమాన్యంతో చర్చించి తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ బడికల కృష్ణ, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ దామెర ప్రవీణ్ కుమార్, కేంద్ర కార్యదర్శి మామిడిపల్లి మధు కృష్ణ, ఎస్ టి పి పి వైస్ ప్రెసిడెంట్ పులి సురేష్ పాల్గొన్నారు. సింగరేణి యాజమాన్యం తరపున సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్ , డైరెక్టర్ (పా) గౌతమ పొట్రు , డైరెక్టర్ (ఈ అండ్ ఎం) తిరుమల రావు, జనరల్ మేనేజర్ (పర్సనల్/ ఐ ఆర్ పి యం) జీవీ కిరణ్ కుమార్, జి.ఎం (వెల్ఫేర్) అజయ్ కుమార్ హాజరయ్యారు.

# ఇతరులకు సహాయం చేయడం ఒక బాధ్యతగా అలవాటు చేసుకోవాలి

**- మండల విద్యాధికారి నీరజ**



**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 22 (భద్రాద్రి న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చుంచుపల్లి మండలం, అంబేద్కర్ నగర్ స్కూల్, ములుగుగూడెం స్కూల్ లో చదువుకునే పిల్లలకు ఎస్కే.అబ్దుల్ బాషిత్, గౌరీ శంకర్, దుర్గా ప్రసాద్ సహకారంతో యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు జరుపుల బాలు స్టేషనరీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల విద్యాధికారి నీరజ మాట్లాడుతూ... ఒకవైపు అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి బ్లడ్ ఏర్పాటు చేస్తూ, మరో వైపు పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం, ప్రభుత్వ పాఠశాలలో కావాల్సిన వసతులను ఏర్పాటు చేయడం, వివిధ మెడికల్ సర్వీసెస్ అందించడం, విద్యార్థులకు కావాల్సినవి దాతల సహకారంతో అందించడం వంటి ఎన్నో కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరు సహాయం చేయడం ఓ బాధ్యతగా అలవాటు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలాజీ, రాములు, గ్రామ పంచాయతీ సర్పంచ్ సీతారాములు, కమిటీ చైర్మన్ రజిత, ఉపాధ్యాయులు రాము, వెంకటమ్మ పాల్గొన్నారు.

# కారేపల్లి టౌన్‌లో లోవోల్టేజ్ సమస్యకు చెక్

**- 160 కేవీఏ డీటీఆర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్**

**- విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని ఎమ్మెల్యే వెల్లడి**



**కారేపల్లి, ఆగస్టు 22 (భద్రాద్రి న్యూస్ రాములు):** కారేపల్లి టౌన్‌లో చాలాకాలంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న లోవోల్టేజ్ సమస్యకు పరిష్కారం లభించనుంది. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన 160 కేవీఏ డీటీఆర్‌ను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. నూతన డీటీఆర్ అందుబాటులోకి రావడంతో లోవోల్టేజ్ సమస్య తగ్గి విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. నూతన డీటీఆర్ ఏర్పాటు చేసి సమస్యకు పరిష్కారం చూపిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్, విద్యుత్ శాఖ అధికారులకు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కారేపల్లి సర్పంచ్, మండల కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు, విద్యుత్ శాఖ ఏఈ, లైన్‌మెన్లు, సిబ్బంది, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రకృతి నడకతో విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన

**- కస్తూర్బా విద్యాలయంలో ఎకో క్లబ్ ఆధ్వర్యంలో ప్రకృతి నడక**

**- ప్రకృతి పరిరక్షణ ప్రతి విద్యార్థి బాధ్యత: ప్రిన్సిపాల్ ఝాన్సీ**



**కారేపల్లి, ఆగస్టు 22 (భద్రాద్రి న్యూస్ రాములు):** పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించేందుకు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ ఎకో క్లబ్ ఆధ్వర్యంలో ప్రకృతి నడక కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠ్యాంశాలతో పాటు ప్రకృతిని ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా విద్యార్థులకు పర్యావరణంపై లోతైన అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ ప్రిన్సిపాల్ ఝాన్సీ విద్యార్థులతో కలిసి ప్రకృతి నడకలో పాల్గొని పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి మనకు జీవనాధారమని, చెట్లు ప్రాణవాయువును అందించడంతో పాటు వాతావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రకృతిని కాపాడటం అంటే భవిష్యత్ తరాల జీవనాన్ని కాపాడటమేనని అన్నారు. ప్రతి విద్యార్థి చిన్ననాటి నుంచే పర్యావరణ పరిరక్షణపై బాధ్యతాయుతమైన ఆలోచనను అలవర్చుకోవాలని సూచించారు. చెట్లు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం, నీటిని పొదుపుగా వినియోగించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి అలవాట్లను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని కోరారు. ప్రకృతిని పుస్తకాల్లో చదవడం కంటే ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణంపై ఆసక్తి, బాధ్యత మరింత పెరుగుతుందని ప్రిన్సిపాల్ ఝాన్సీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చెట్లు, మొక్కలు, పక్షులు, ప్రకృతిలోని వివిధ జీవరాశులను ఆసక్తిగా పరిశీలించారు. ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పించేలా ఉపాధ్యాయులు పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎకో క్లబ్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా అంగన్వాడీ పోస్టుల ఎంపిక

**- దళారులను ఆశ్రయించి మోసపోవద్దు**

**- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా**



**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 22 (భద్రాద్రి న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అంగన్వాడీ టీచర్లు, సహాయకుల పోస్టుల భర్తీకి చేపట్టిన ఎంపిక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా తెలిపారు. అంగన్వాడీ టీచర్లు, సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఎలాంటి దళారులను నమ్మి మోసపోవద్దని ఆమె సూచించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని, తమకు ఉన్నతాధికారులతో పరిచయాలు ఉన్నాయని చెప్పే వ్యక్తులను నమ్మి డబ్బులు చెల్లించవద్దని హెచ్చరించారు. ఎంపిక ప్రక్రియకు జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, నిర్దేశించిన అర్హతలు, రిజర్వేషన్ నిబంధనలు, మెరిట్ ఆధారంగా ఎంపిక జరుగుతుందని స్పష్టం చేశారు. ఎవరికీ ముందస్తుగా ఉద్యోగం ఖరారయ్యే అవకాశం లేదని, పూర్తిగా నిబంధనల ప్రకారమే అభ్యర్థుల ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు.

# ఏ సమస్య వచ్చిన మా దృష్టికి తెండి పరిష్కరిస్తా

**- చైర్ మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ**





**వైరా, ఆగస్టు 22, (భద్రాద్రి న్యూస్) :** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ 20 వార్డులలో ఏ సమస్య వచ్చినా దాని సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపాచంద్రకళ మురళీకృష్ణ తెలిపారు. వైరాలోని 12, 13 వ వార్డులలో కలిపి ఉన్న రహదారికి త్వరలో టెండర్లు పూర్తవుతాయని పర్మినెంట్గా సిమెంట్ రోడ్ వెయ్యటానికి చర్యలను మున్సిపాలిటీ తీసుకుంటుందని చైర్ పర్సన్ చంద్రకళ ఈ సందర్భంగా తెలిపారు. ఆయా వార్డులలో ఉన్న ప్రజలు తమ వంతు బాధ్యతగా వ్యవహరించి సమస్యను సానుకూలంగా పరిష్కరించే దిశగా ఉండాలని, అదేవిధంగా వైరా మున్సిపాలిటీకి కూడా ప్రజల సహకారం ఉండాలని, అవసరమని, ప్రతి ఇంటి యజమాని తమ తమ ఇంటి పన్నులను సకాలంలో చెల్లించి వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని, ఆమె పేర్కొన్నారు. అనంతరం వార్డు యువకులు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ఈ రహదారి పరిష్కారం లేక మరుగున పడిపోయిందని, నీళ్లు ఇళ్లల్లోకి చేరి నాన్న ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికైనా నూతన పాలకమండలి మా సమస్యను పరిష్కరించే దిశగా, ఆలోచించాలని, రహదారికి సిమెంట్ రోడ్డు ఏర్పాటుకు, ఇరుపక్కల డ్రైనేజీ విస్తరణ చర్యలు చేపట్టాలని విన్నవించారు. మా వార్డుల సమస్యను మున్సిపల్ అధికారులకు, చైర్ పర్సన్ దృష్టికి తీసుకురాగానే, కొంతలో కొంతైనా సమస్య పరిష్కరించేందుకు గ్రావెల్ తో మరమ్మత్తులు చేసి చేపట్టినందుకు మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళను, మున్సిపల్ సిబ్బందిని అభినందించారు. మున్సిపల్ ఏఈ రహదారి పనులను దగ్గరుండి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముల్లపాటి సీతారాములు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఇల్లందు--డోర్నకల్ మధ్య మూడు పూటలా రైలు నడపాలి

**- రైల్వే అధికారులు, కేంద్ర ప్రభుత్వం, సింగరేణి తక్షణమే స్పందించాలి**

**- రిలే నిరాహార దీక్షకు సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ సంపూర్ణ మద్దతు**




**కారేపల్లి, ఆగస్టు 22 (భద్రాద్రి న్యూస్ రాములు ):** ఇల్లందు నుంచి డోర్నకల్ వరకు రోజుకు మూడు పూటలా ప్రయాణికుల రైలు నడపాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ అశోక్ అన్న వర్గం డిమాండ్ చేసింది. ఈ డిమాండ్‌తో రిలే నిరాహార దీక్ష చేస్తున్న కంచర్ల శ్రీనివాసరావుకు పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. దీక్ష శిబిరాన్ని సందర్శించిన సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు భూక్య శివనాయక్ దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా భూక్య శివనాయక్ మాట్లాడుతూ 130 సంవత్సరాల చరిత్ర కలిగిన ఇల్లందు బొగ్గు గనులకు పురిటిగడ్డగా ఉన్నప్పటికీ, నేడు ఇల్లందు ప్రాంతం అభివృద్ధి, రవాణా సౌకర్యాల పరంగా వెనుకబడిపోయిందని అన్నారు. ఇల్లందు నుంచి నిత్య అవసరాల కోసం ములుగు, ఖమ్మం, కారేపల్లి, కొత్తగూడెం తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు రవాణా సౌకర్యాల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సింగరేణి సంస్థతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇల్లందు ప్రాంతం నుంచి వేల కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతున్నప్పటికీ, ప్రజలకు అవసరమైన కనీస రవాణా సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం కొనసాగుతోందని విమర్శించారు. రైల్వే అధికారులు, కేంద్ర ప్రభుత్వం, సింగరేణి సంస్థ తక్షణమే స్పందించి డోర్నకల్--ఇల్లందు మధ్య రోజుకు మూడు పూటలా ప్రయాణికుల రైలు సేవలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మూడు పూటలా రైలు సౌకర్యం అందుబాటులోకి వస్తే ఇల్లందు, కారేపల్లి, డోర్నకల్ ప్రాంతాల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ముఖ్యంగా వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగులు, నిత్యం దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రజలకు ఈ రైలు సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ప్రయాణికుల రైలు సేవలను పునఃప్రారంభించడం ద్వారా ఇల్లందు ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు వెంటనే స్పందించి రైల్వే శాఖపై ఒత్తిడి తీసుకువచ్చి ఇల్లందు--డోర్నకల్ మధ్య మూడు పూటలా ప్రయాణికుల రైలు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని భూక్య శివనాయక్ కోరారు. రిలే నిరాహార దీక్ష చేస్తున్న కంచర్ల శ్రీనివాసరావుకు సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ అశోక్ అన్న వర్గం తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

# కరెంట్ పోతే పెట్రోల్ బంకులో జనరేటర్ ఏది?

**- విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో బారులు తీరిన వాహనాలు**

**- ప్రత్యామ్నాయ విద్యుత్ సౌకర్యం కల్పించాలని వాహనదారుల డిమాండ్**



**కారేపల్లి, ఆగస్టు 22 (భద్రాద్రి న్యూస్ రాములు):** కారేపల్లిలో వీధి విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానిక పెట్రోల్ బంకులో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ లేక పెట్రోల్ పంపులు పనిచేయకపోవడంతో పెట్రోల్ కోసం వచ్చిన వాహనాలు బంకు వద్ద బారులు తీరాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా పెట్రోల్ బంకుల్లో ప్రత్యామ్నాయ విద్యుత్ సౌకర్యం అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. అయితే కారేపల్లి పెట్రోల్ బంకులో జనరేటర్ అందుబాటులో లేకపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిన సమయంలో పెట్రోల్ కోసం వచ్చిన వాహనదారులు నిరీక్షించాల్సి వచ్చింది. గతంలో సాధారణ పెట్రోల్‌కు బదులుగా అధిక ధర కలిగిన పవర్ పెట్రోల్ మాత్రమే అందుబాటులో ఉంచిన సందర్భంలోనూ వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని పలువురు తెలిపారు. తాజాగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పాటు జనరేటర్ కూడా అందుబాటులో లేకపోవడంతో మరోసారి ఇబ్బందులు పడాల్సి వచ్చిందని వాహనదారులు అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయమై బంకు సిబ్బందిని వివరణ కోరగా, జనరేటర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో మరమ్మతుల కోసం పంపించామని, గత మూడు రోజులుగా జనరేటర్ అందుబాటులో లేదని తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో పెట్రోల్ విక్రయాలకు అంతరాయం కలగకుండా జనరేటర్‌ను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని వాహనదారులు కోరుతున్నారు. వినియోగదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పెట్రోల్ బంకులో ప్రత్యామ్నాయ విద్యుత్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

**- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై వ్యాఖ్యలకు కొండా సుస్మిత బహిరంగ క్షమాపణ చెప్పాలి**

**- రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలకు తావులేదు**

**: ఎమ్మెల్యే రాందాస్ నాయక్**



**కారేపల్లి, ఆగస్టు 22 (భద్రాద్రి న్యూస్ రాములు ):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత, వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రిపై వ్యాఖ్యలు చేసిన కొండా సుస్మిత వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం కారేపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సందర్భంగా రాందాస్ నాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదన్నారు. రాజకీయంగా భిన్నాభిప్రాయాలు ఉంటే వాటిని ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తం చేయాలని, వ్యక్తిగత దూషణలకు పాల్పడటం తగదని అన్నారు. ప్రజా జీవితంలో ఉన్న ప్రతి ఒక్కరూ తాము మాట్లాడే మాటలకు బాధ్యత వహించాలని సూచించారు. ముఖ్యమంత్రిపై చేసిన వ్యాఖ్యలకు కొండా సుస్మిత బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి అనుచిత వ్యాఖ్యలను సహించబోమని స్పష్టం చేశారు. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కాంగ్రెస్ అధిష్టానం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి పదవికి ఉన్న గౌరవాన్ని కాపాడుతూ రాజకీయ నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాందాస్ నాయక్ సూచించారు. వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉండి ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని అన్నారు. విలేకరుల సమావేశంలో దిశా కమిటీ సభ్యురాలు హేమలత, బాలాజీ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూరి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయక్, సీనియర్ నాయకులు అడ్డగోడ ఐలయ్య, వినోద్ నాయక్, మేదరి టోనీ, వీర ప్రతాప్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**- 24, 25 తేదీల్లో 48 గంటల దీక్షలకు హాజరవుతాం**

**- ఖమ్మం కలెక్టరేట్ ఎదుట దీక్షలను విజయవంతం చేయాలి: సీఐటీయూ**



**సింగరేణి, ఆగస్టు 22 (భద్రాద్రి న్యూస్ రాములు ):** గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ సింగరేణి మండల కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 24, 25 తేదీల్లో ఖమ్మం కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న 48 గంటల దీక్షల్లో పాల్గొంటామని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీఓ రవీంద్ర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ సింగరేణి మండల కన్వీనర్ కే. నరేంద్ర మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు అనేక సంవత్సరాలుగా జీవో నంబర్ 51 ప్రకారం బహుళ ప్రయోజన విధానంలో తీవ్ర పని భారంతో పనిచేస్తున్నారని అన్నారు. బహుళ ప్రయోజన విధానాన్ని సవరించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండో వేతన సవరణ సంఘంలో గ్రామపంచాయతీ కార్మికులను గుర్తించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. కార్మికుల వేతనాలను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని, ఎలాంటి కారణం లేకుండా కార్మికులను తొలగించకుండా ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘించే సర్పంచులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామపంచాయతీ కార్మికులపై పని భారాన్ని తగ్గించి, ఉద్యోగ భద్రత కల్పించాలని నరేంద్ర అన్నారు. ఖమ్మం కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న 48 గంటల దీక్షలను విజయవంతం చేయాలని గ్రామపంచాయతీ కార్మికులకు పిలుపునిచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సీఐటీయూ సింగరేణి మండల కార్యదర్శి ఎస్. నాగేశ్వరరావు, మండల ఉపాధ్యక్షులు బోళ్ల కొమరయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఆధర్ల గౌతం తదితరులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి అరెస్ట్ లు ఉద్యమాన్ని ఆపలేవు




**గుండాల ఆగస్టు 22 భద్రాద్రి న్యూస్ :** గుండాల మండలం ముత్తాపురం గ్రామం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ గేటు ముందు ఆదివాసి సంక్షేమ పరిషత్ గుండాల మండల అధ్యక్షులు పూనేం రమణ బాబు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించగా, ఈ సమావేశంలో కోడెం వెంకటేశ్వర్లు తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వాగబోయిన చంద్రయ్య దొర ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు పాల్గొని మాట్లాడుతూ, గత నాలుగు రోజుల నుండి ముత్తాపురం ఏకలవ్య రెసిడెన్షియల్ మోడల్ స్కూల్ నందు జరుగుతున్న ధర్నాని నిన్న అర్ధరాత్రి సమయంలో పోలీస్ అధికారులు భగ్నం చేయడం జరిగింది, అర్ధరాత్రి అక్రమ అరెస్టులు ఉద్యమాన్ని ఆపలేవని న్యాయం ఎప్పటికీ గెలుస్తుందని ఆదివాసీ నాయకులు.ఎ పి ఓ ఆర్సిఓ గారితో చర్చలు జరపగ, ధర్నాని విరమించుకోండి ఏవైతే తీజ్ పండగ మరియు ఆదివాసి పిల్లలపై కుల వివక్షత చూపెడుతున్న ఉపాధ్యాయులను ఉన్నత అధికారులతో సమగ్ర విచారణ జరిపి వాళ్లని నిధులనుండి తొలగించే ప్రయత్నం చేస్తామని హామీ ఇవ్వగా తొలగించే వరకు మా ధర్నాని విరమించుకోమని కోరగా దానికి ఆదివాసి నాయకులు 9 తెగల జేఏసీ చైర్మన్ చుంచు రామకృష్ణ మరియు అక్కడి సంఘాలకు కమిటీ సభ్యులను అర్ధరాత్రి రెండున్నర సమయంలో అరెస్టు చేయడం సరికాదని తప్పు చేసిన ఉపాధ్యాయులను స్కూలు ఆవరణలో ఉంచుకొని ఉద్యమాన్ని ఆపడం కోసం ఉద్యమకారులను నాయకులను అరెస్టు చేయటం సరైనది కాదని, తప్పు చేసిన ఉపాధ్యాయులను అరెస్టు చేయకుండా సజావుగా విధులను నిర్వర్తిస్తుంటే అధికారులు సోద్యం చేస్తున్నారా అని మండిపడ్డారు, తక్షణమే ఉపాధ్యాయులని తొలగించాల్సిన అవసరం ఉందని అధికారులకు గుర్తు చేశారు,అనంతరం అధికారులు మాట్లాడుతూ ఏదైనా తప్పు జరిగి ఉంటే కచ్చితంగా ఉపాధ్యాయులను విధుల నుండి తొలగింస్తామని దానికి కాను మాకు కొంత సమయం కావాలని కోరుతూ హామీ ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు లింగగూడెం సర్పంచ్ చింత వెంకటేశ్వర్లు, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మొక్కా ళ్ళ వీరస్వామి మండల నాయకులు మొక్కళ్ళ నరేష్ సయ్యద్ అజ్జు,గోగ్గేలా రమేష్ కాంగ్రెస్ నాయకులు ఈసం రాజబాబు,తెల్లం కిరణ్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వేగవంతంగా డిజిటల్ క్రాప్ సర్వే

**- రైతుల వారీ పంటల వివరాల నమోదు**
**- క్షేత్రస్థాయిలో పరిశీలించిన కె.వెంకటేశ్వరరావు**
**- మండలం వ్యవసాయ శాఖ అధికారి తారా దేవి**

**కామేపల్లి,ఆగస్టు 22 (భద్రాద్రి న్యూస్):** ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు వారీ పంటల నమోదు ప్రక్రియ కామేపల్లి మండలంలో శరవేగంగా కొనసాగుతోంది. శనివారం మండల వ్యాప్తంగా వాలంటీర్ల సహాయంతో నిర్వహిస్తున్న ఈ 'డిజిటల్ క్రాప్ సర్వే' పనులను ఖమ్మం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కె. వెంకటేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేసి, క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్వే జరుగుతున్న తీరును పరిశీలించిన ఆయన,డిజిటల్ నమోదులో అనుసరించాల్సిన సాంకేతిక అంశాలపై వాలంటీర్లకు పలు సూచనలు చేశారు. ప్రతీ రైతు పొలానికి ప్రత్యక్షంగా వెళ్ళి, సాగు చేసిన పంట వివరాలను, విస్తీర్ణాన్ని ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితత్వంతో యాప్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మద్దతు ధర,పంట నష్టపరిహారం వంటి ప్రయోజనాలు రైతులకు సక్రమంగా అందాలంటే ఈ డిజిటల్ క్రాప్ సర్వే సమాచారమే అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. నమోదు ప్రక్రియను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కామేపల్లి మండల వ్యవసాయ అధికారి తారాదేవి,ఏఈఓ జగదీశ్వర్,స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారులు, వాలంటీర్లు గ్రామానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.



# జీవో 97ను తక్షణమే రద్దు చేయాలి

**- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడితే ఊరుకోం.. కాంగ్రెస్ ప్రభుత్వం తుగ్లక్ నిర్ణయాలు మానుకోవాలి**
**- జీవో 97పై బీఆర్ఎస్ యువజన విభాగం భగ్గుమన్నది.. చర్లలో నిరసన, తహసీల్దార్‌కు వినతిపత్రం**





**చర్ల, ఆగస్టు 22 (భద్రాద్రి న్యూస్):** విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే జీవో నంబర్ 97ను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చర్ల మండల బీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం తీవ్ర నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన కీలక నిర్ణయాలను ఏకపక్షంగా తీసుకోవడం సరికాదని బీఆర్ఎస్ యువజన నాయకులు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపు మేరకు, నియోజకవర్గ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్, మాజీ ఇన్‌చార్జి మానే రామకృష్ణ, మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, నియోజకవర్గ యువజన నాయకుడు కాకి అనిల్ సూచనలతో ఈ ఆందోళన చేపట్టారు. మండల యువజన విభాగం అధ్యక్షుడు అంబోజి సతీష్, కార్యదర్శి కుప్పల నిరంజన్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువజన నాయకులు మాట్లాడుతూ.. జీవో నంబర్ 97 ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, ఐటీఐలు, అప్రెంటిస్ శిక్షణా కేంద్రాలను 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' **(YISU)** పరిధిలోకి, అలాగే కొత్తగా ఏర్పాటు చేసిన 'శక్తి' శాఖ పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ మార్పుల వల్ల సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ విద్య పూర్తిచేసిన విద్యార్థులు జుజుజు ద్వారా బీటెక్ రెండో సంవత్సరంలో నేరుగా ప్రవేశం పొందే లాటరల్ ఎంట్రీ విధానం కొనసాగుతుందా? లేదా? అనే సందేహాలు విద్యార్థుల్లో నెలకొన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పష్టత ఇవ్వకుండానే విద్యా వ్యవస్థలో మార్పులు చేయడం వల్ల విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారని విమర్శించారు. స్కిల్ యూనివర్సిటీ పబ్లిక్--ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో కొనసాగితే భవిష్యత్తులో ఫీజుల భారం పెరిగే ప్రమాదం ఉందని, దాని ప్రభావం ప్రధానంగా పేద, మధ్యతరగతి విద్యార్థులపై పడుతుందని నాయకులు హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విషయంలోనూ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సాంకేతిక విద్యను కేవలం 'స్కిల్' పేరుతో కార్మిక శక్తిని తయారు చేసే కేంద్రాలుగా మార్చే ప్రయత్నాలను సహించేది లేదని బీఆర్ఎస్ యువజన నాయకులు ఘాటుగా వ్యాఖ్యానించారు. విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు ఉన్నత విద్యకు విస్తృత అవకాశాలు కల్పించాల్సిన ప్రభుత్వం.. వారి భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చే నిర్ణయాలు తీసుకోవడం దురదృష్టకరమన్నారు. విద్యార్థుల ప్రయోజనాలను దెబ్బతీసే జీవో 97ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్‌పై స్పందించకపోతే విద్యార్థులను కలుపుకుని ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడకుండా ప్రభుత్వం తక్షణమే పునరాలోచన చేసి జీవో 97ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, ఆర్. కొత్తగూడెం సర్పంచ్ తుర్రం రవి, పాకలపాటి సత్యనారాయణరాజు, బొజ్జ ప్రణయ్, పంజా రాజు, మామిడి రాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొంబత్తిని రాంబాబు, ఉపసర్పంచ్ ఎడ్ల రామదాసు, బీసీ సెల్ అధ్యక్షుడు గోరెంట్ల వెంకటేశ్వర్లు, తడికల చంద్రశేఖర్, యువజన నాయకులు సృజన్, ప్రేమ్, కృష్ణంరాజు, వంశీ, సాగర్, నితీష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# నేటి అర్ధరాత్రి నుంచి ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్‌ల బంద్

**తెలంగాణ ఆటో, యాప్ ఆధారిత సంఘాల జేఏసీ**

**ఆగస్టు 22 (భద్రాద్రి న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం అర్ధరాత్రి నుంచి ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్‌ల బంద్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఆటో, యాప్ ఆధారిత సంఘాల జేఏసీ నేతలు ప్రకటించారు. శనివారం 18 సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం బీపీటీఎంఎం జాతీయ ప్రధాన కార్యదర్శి అల్లూరి రవిశంకర్, జేఏసీ కన్వీనర్ ముకేశ్‌గౌడ్, ఇతర నేతలు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఆటో డ్రైవర్లకు 3 హామీలిచ్చిందని, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించిందని మండిపడ్డారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో 200 మంది డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని.. దీనికి రేవంత్ సర్కారే బాధ్యత వహించాలన్నారు. హామీలు అమలు చేయకుండా, ఆర్టీసీలో ఈవీ ఆటోల ప్రతిపాదన తేవడం సరికాదన్నారు. ఆటో, ప్రైవేట్ రవాణా కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తూ జీవో జారీ చేయాలని, ఆటోడ్రైవర్లకు ఇస్తామన్న ఏటా రూ.12వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓలా ఉబర్, ర్యాపిడో బైకులపై నిషేధం విధించాలన్నారు. 'ఆటో త్రీవీలర్ లైసెన్స్ పునరుద్ధరించాలి. గిగ్ వర్కర్స్ అగ్రిగేటర్ పాలసీని రాష్ట్రంలో అమలు చేయాలి. ట్రాఫిక్ చలాన్లపై 80 శాతం సబ్సిడీ ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు.



## అప్పాయిగూడెంలో పారిశుధ్యానికి పెద్దపీట

**- డ్రైనేజీ, నూతన పైప్‌లైన్ పనులకు శ్రీకారం**
**- పరిశుభ్రమైన వాతావరణం కోసం చర్యలు: సర్పంచ్ దండు ప్రవీణ్**







**అప్పాయిగూడెం, ఆగస్టు 22 (భద్రాద్రి న్యూస్ రాములు ):** గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు సర్పంచ్ దండు ప్రవీణ్ తెలిపారు. పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు, పిచ్చిమొక్కలను ట్రాక్టర్ సహాయంతో తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. దోమలు, ఈగలు, వ్యాధికారక క్రిముల వ్యాప్తిని నివారించేందుకు అవసరమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. అదేవిధంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో వర్షపు నీరు, మురుగునీరు రోడ్లపై నిల్వ ఉండకుండా సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులను చేపట్టారు. జేసీబీ యంత్రం సహాయంతో డ్రైనేజీ కోసం తవ్వకాలు చేపట్టి, అవసరమైన ప్రాంతాల్లో నూతన పైప్‌లైన్ ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సర్పంచ్ దండు ప్రవీణ్ మాట్లాడుతూ వర్షాకాలంలో నీరు నిల్వ ఉండే సమస్యను తగ్గించడంతో పాటు గ్రామంలో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరిచి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యమని తెలిపారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సౌకర్యానికి అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నామని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ రోడ్లపై చెత్తాచెదారం వేయకుండా గ్రామ పంచాయతీకి సహకరించాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ దండు ప్రవీణ్, కార్యదర్శి కృష్ణవేణి, గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గాదెపాడు పంచాయతీలో పారిశుధ్యానికి పెద్దపీట

**- గార్లపాడు, ఒడ్డుగూడెం, చర్లపల్లిలో ప్రతి వీధిలో బ్లీచింగ్ పౌడర్ చల్లింపు**
**- ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు: సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్**



**సింగరేణి, ఆగస్టు 22 (భద్రాద్రి న్యూస్ రాములు ):** వర్షాకాలంలో వ్యాధులు, దోమలు, ఈగల వ్యాప్తిని అరికట్టి ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు గాదెపాడు గ్రామపంచాయతీ ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టింది. గ్రామపంచాయతీ పరిధిలోని గార్లపాడు, ఒడ్డుగూడెం, చర్లపల్లి గ్రామాల్లోని ప్రతి వీధిలో శనివారం బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరిచేలా బ్లీచింగ్ పౌడర్ చల్లించడం ద్వారా దోమలు, ఈగలు, వ్యాధికారక క్రిముల వ్యాప్తిని నియంత్రించేందుకు చర్యలు చేపట్టారు. వర్షాకాలంలో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రతి గ్రామంలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ గ్రామపంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాదెపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్, కార్యదర్శి, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా.. ఎమ్మెల్యే విద్యా యాత్ర

**- విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే జారే సమీక్షా సమావేశం**
**- పిల్లల లక్ష్యాలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే.. విద్యార్థులతో కలిసి భోజనం**



**భద్రాద్రి న్యూస్, దమ్మపేట, ఆగస్టు 22:** అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం గండుగులపల్లిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (జువీ=హా)లో 'నేను సైతం చేయూత' కార్యక్రమంలో భాగంగా 'విద్యా యాత్ర--మన ఎమ్మెల్యే.. మన బడి' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యార్థుల చదువు, నైపుణ్యాలు, విద్యా ప్రగతిపై స్వయంగా ఆరా తీశారు. విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ.. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని తెలిపారు. ఉపాధ్యాయులు అందిస్తున్న బోధన, విద్యార్థుల సమస్యలపై సమగ్రంగా చర్చించారు.అనంతరం ఎమ్మెల్యే స్వయంగా విద్యార్థులకు టిఫిన్, భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ వారి భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. గిరిజన ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఈద్దప్ప, మాజీ సర్పంచులు మడకం రాజేష్, కారం సుధీర్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by CHENGAPONGUSAIDULU,and printed at KAKATI BABU PRINTERS H No.4-10.Telagarama varam,Laximidevipally, Kothagudem -507101,Dist .Bhadradri kothagudem, Telangana. And Published At HNo. DA-416,Babu camp,chunchupalli (M), Kothagudem-507101,Dist Bhadradri kothagudem, Telangana.Editor: CHENGAPONGU SAIDULU. RNI TELTEL 2023/90682Call No.6302329046